సాక్షి కర్నూలు

సోమవారం । 1 । జనవరి । 2024



0.8 టీఎంసీల నీటి నిల్వ

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌లో ఆదివారం నాటికి 0.845 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జున స్వామివార్లకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



.. విస్తృతంగా సంక్షేమం

నూతన సంవత్సరం జనవరి 1 నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు విస్తృతంగా సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది.

IIలో▸



కర్నూలులో కేకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

నవోత్సాహం

నూతన ఆశలతో.. సరికొత్త ఆశయాలతో.. నవోత్సాహంతో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత కొత్త సంవత్సరానికి జిల్లా ప్రజలు స్వాగతం పలికారు. కేకులు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ తదితర పట్టణాల్లో యువత సరదాగా గడిపారు. నూతన ఆకాంక్షలతో 2024 సంవత్సరాన్ని ఆహ్వానించారు.



వాటర్‌గ్రిడ్ ట్రయల్ రన్ విజయవంతం

- జనవరి మొదటి వారంలో బేతంచెర్ల మండలానికి శుద్ధజలం

డోన్/బేతంచెర్ల: కొన్ని దశాబ్దాలుగా తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న డోన్ నియోజకవర్గానికి త్వరలో నీటి కష్టాలు పరిష్కారం కానున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ప్రారంభమైన మెగా వాటర్‌గ్రిడ్ పనులు నియోజకవర్గంలో అత్యంత వేగంగా జరుగుతున్నాయి. రూ.350 కోట్లతో పాణ్యం మండలం గోరుకల్లు రిజర్వాయర్ నుంచి డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి, బేతంచెర్ల, డోన్ మండలాల పరిధిలోని గ్రామాల్లోని ఇంటింటికి నీరందించే ఈ బృహత్తర పథకం ప్రారంభానికి ఆదివారం తొలి అడుగు పడింది. రిజర్వాయర్ నుంచి సుగాలిమెట్ట వద్ద నిర్మించిన పంప్‌హౌస్‌లోకి నీటిని విజయవంతంగా పంపింగ్ చేశారు. ఇక్కడి నుంచి బేతంచెర్ల మండలం సిమెంట్ నగర్ వద్ద 10 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన పంప్‌హౌస్‌కు జనవరి 2వ తేదీ లోపు మంచినీరు వచ్చే అవకాశం ఉంది. ఇక్కడ ఫిల్టర్ బెడ్లో నీరు శుభ్రపరిచిన తర్వాత జనవరి 7, 8వ తేదీలలో మొదటి విడతగా బేతంచెర్ల మండల ప్రజలకు శుద్ధ జలాన్ని అందించేందుకు అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో నియోజకవర్గానికి ఈ బృహత్తర పథకం మంజూరై అనతికాలంలోని ప్రజలకు శుద్ధజలం అందుతుండటం శుభపరిణామమని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

అందరికీ శుభాలు కలగాలి

- మంత్రులు బుగ్గన, గుమ్మనూరు

కర్నూలు(సెంట్రల్): నూతన సంవత్సరం 2024లో ప్రజలంతా ఆనందంగా, సుఖ సంతోషాలతో జీవించాలని, అందరికీ శుభాలు కలగాలని జిల్లా ఇన్‌చార్జి, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆకాంక్షించారు. ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కర్నూలు (టౌన్): జిల్లా ప్రజలందరికీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బీవై రామయ్య నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ మరోసారి అధికారంలోకి వచ్చి ప్రజలకు మంచి పాలన అందిస్తుందన్నారు.

నేడు జగనన్నకు చెబుదాం-స్పందన రద్దు

కర్నూలు(సెంట్రల్): జనవరి 1వ తేదీ కావడంతో సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించే జగనన్నకుచె బుదాం-స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

నేటి పోలీసు స్పందన రద్దు

కర్నూలు: ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో జనవరి 1వ తేదీ (సోమవారం) నిర్వహించనున్న స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఎస్పీ కృష్ణకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి అర్జీదారులు వ్యయ ప్రయాసాలతో స్పందనకు రావద్దని సూచించారు. వచ్చే సోమవారం యథాథంగా స్పందన కార్యక్రమం కొనసాగుతుందని ఎస్పీ పేర్కొన్నారు.

వెండి కవచాల బహూకరణ



శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులకు వెండి కవచాలను అందజేస్తున్న దాత గుండాచార్

మంత్రాలయం: కర్ణాటక రాష్ట్రం మైసూర్‌కు చెందిన గుండాచార్ అనే భక్తుడు మంత్రాలయంలో వెలసిన శ్రీ రాఘవేంద్ర స్వామికి వెండి కవచాలను బహూకరించారు. ఆదివారం శ్రీ మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులకు కవచ పలకాలను అందజేశారు. మూల బృందవనానికి ఈ కవచాలను తొడగనున్నారు. ఈ సందర్భంగా దాతలకు పీఠాధిపతి మంత్రాక్షితలు అందజేసి ఆశీర్వదించారు.

7న విజయవాడలో గిరిజన శంఖారావం

గడివేముల: విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈనెల 7వ తేదీన గిరిజన శంఖారావం నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ తెలిపారు. ఆదివారం వై.కె తండా గ్రామంలో గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు రాజు నాయక్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి నాయక్ ఆధ్వర్యంలో శంఖారావం పోస్టర్లను ఆవిష్కరించారు.

నూతన సంవత్సరం.. విస్తృతంగా సంక్షేమం

- వరుసగా సంక్షేమ పథకాల అమలు
- అధికార యంత్రాంగానికి మార్గదర్శకాలు జారీ

కర్నూలు(సెంట్రల్): నూతన సంవత్సరం విస్తృతంగా సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. జనవరి 1 నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు అందించనున్న సంక్షేమ పథకాలతో పేదల బతుకుల్లో పెను మార్పులు సంభవించనున్నాయి. వైఎస్సార్ పెన్షన్ కానుక, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ రైతు భరోసా, పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, వలంటీర్లకు సన్మానం తదితర సంక్షేమ పథకాలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా యంత్రాంగాలకు స్పష్టమైన మార్గదర్శకాలు, షెడ్యూల్‌ను విడుదల చేసింది.

45 రోజుల యాక్షన్ ప్లాన్...

లక్షలాది మంది పేదలు లబ్ధిపొందేలా సంక్షేమ పథకాలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం 45రోజుల యాక్షన్ ప్లాన్‌ను రూపొందించింది. జనవరి 1 నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు దీనిని అమలు చేయనున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారు. ఈ క్రమంలో వైఎస్సార్ పెన్షన్ వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, రైతు భరోసా తదితర పథకాల ఆఖరి విడతలను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. వైఎస్సార్ పెన్షన్ కానుక పథకాన్ని అవ్వాతాతలకు జనవరి నుంచి 8వ తేదీ వరకు అందజేయనున్నారు. పింఛన్‌ను రూ.2750 నుంచి రూ.3 వేలకు పెంచి ఇస్తారు. జిల్లాలో దాదాపు 3,25,730 మంది పెన్షన్‌దారులు ఉన్నారు. జనవరి 23 నుంచి 30వ తేదీ వరకు వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా నాలుగో విడత కింద మంజూరైన నిధులను పొదుపు మహిళల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఇందుకోసం జనవరి 18 నుంచే ముందస్తు ప్రచార కార్యక్రమాలు కొనసాగుతాయి. జిల్లాలో 1,73,227 మహిళా గ్రూపులు ఆసరాకు అర్హులు. 45 ఏళ్లు దాటిన మహిళలు వ్యాపారం, ఇతర జీవనోపాధుల కోసం వైఎస్సార్ చేయూత పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకం కింద జిల్లాలో 1,24,045 మంది మహిళలు అర్హులుగా ఉండగా.. ఒక్కో మహిళకు రూ.18,750లను ఫిబ్రవరి 5 నుంచి 14వ తేదీ వరకు అందజేయనున్నారు. అలాగే మూడో విడత వైఎస్సార్ రైతు భరోసా రూ.2 వేలు కూడా సంక్రాంతి పండుగ తరువాత రైతుల ఖాతాలోల జమ కానున్నాయి. జిల్లాలో 2,96,789 మంది రైతులు వైఎస్సార్ రైతు భరోసాకు అర్హులు. ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన రైతులకు సంక్రాంతిలోపు ఇన్‌పుట్ సబ్సిడీని జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో దాదాపు 3,25,730 మంది రైతుల పంటలు నష్టపోయాయి. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.450 కోట్లు విడుదల కానున్నాయి. ఫిబ్రవరిలో వలంటీర్లను సత్కరించే కార్యక్రమాలు కూడా ఉన్నాయి.

ప్రచార సభల నిర్వహణ

సంక్షేమ పథకాల అమలులో ప్రజాప్రతినిధులు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొననున్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన లెటర్ అందించి.. మాటల రూపంలో ఉండే వీడియోను లబ్ధిదారులకు వినిపించేలా చూస్తారు. ఆయా పథకాల అమలు కోసం ముందస్తుగా..తరువాతి సభలు నిర్వహించి ప్రాధాన్యలను వివరించాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది.

లబ్ధిదారులకు సీఎం లెటర్ అందజేయాలి



ఫిబ్రవరి 14వ తేదీ వరకు సంక్షేమ పథకాలు అమలు చేయాల్సి ఉంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆయా పథకాల అమలుపై దిశా నిర్దేశం చేసింది. సీఎం రాసిన లెటర్ అందజేసి, ఆయన చెప్పిన మాటల నిడివి ఉన్న వీడియోను లబ్ధిదారులకు వలంటీర్లు చూపించాలి.

–డాక్టర్ జి.సృజన, కలెక్టర్

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం



బొలెరో వాహనాన్ని పరిశీలిస్తున్న సీఐ సురేష్‌కుమార్ రెడ్డి

కృష్ణగిరి: బొలెరో వాహనం ట్రాలీకి ప్రత్యేక అర తయారుచేయించి సినీ ఫక్కీలో ఎవ్వరికీ అనుమానం రాకుండా గుట్టుగా కర్ణాటక మద్యం తరలిస్తున్న సంఘటన ఆదివారం వెలుగుచూసింది. కృష్ణగిరి మండలం నుంచి బాపనదొడ్డికి వెళ్లే రహదారిలో క్రాస్ వద్ద శనివారం రాత్రి ఓ కర్ణాటక రిజిస్ట్రేషన్ కలిగిన బొలెరో (అశోక్ లైలాండ్) వాహనం బోల్తా పడింది. అతివేగంగా బోల్తా పడడంతో వాహనం రెండు ముక్కలైంది. డ్రైవర్ అక్కడి నుంచి జారుకున్నాడు. ఆ దారిలో వెళ్లిన ద్విచక్ర వాహనదారులు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చెరుకుని జేసీబీ సాయంతో వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. ఉదయం అయినా వాహనానికి సంబంధించి ఎవ్వరూ రాకపోవడంతో ట్రాలీ ఎత్తుగా ఉండటాన్ని గమనించారు. ట్రాలీకి ఏర్పాటు చేసిన క్యాబిన్‌ను కట్టర్‌తో తొలగించగా అందులో ప్రత్యేకంగా తయారు చేయించిన అరలో 70 బాక్సుల కర్ణాటక మద్యం కనిపించింది. సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ సురేష్ మద్యాన్ని స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు.

మార్కెట్ ధరకే కందుల కొనుగోలు

- డీసీఎంఎస్ మార్కెట్ యార్డు బ్రాంచ్ మేనేజర్ రాజీవ్

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ కర్నూలు బ్రాంచ్‌లో మార్కెట్ ధరకే రైతుల నుంచి కందులను కొనుగోలు చేస్తున్నట్లు ఆ బ్రాంచ్ మేనేజర్ బి.రాజీవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు రైతులు ముందుగా పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఎఫ్ఏక్యూ నిబంధనల ప్రకారం నాణ్యతా ప్రమాణాలు ఉండాలని తెలిపారు. కర్నూలు, కల్లూరు, గూడూరు మండలాల రైతులకు సంబంధించి కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని డీసీఎంఎస్ బ్రాంచ్‌లో కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9381085983 ఫోన్ చేసి సంప్రదించవచ్చని తెలిపారు.


వెదురు కర్రల పట్టివేత



వెదురు కర్రలను సీజ్‌చేసిన అటవీశాఖ అధికారులు

పాణ్యం : మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఎలాంటి అనుమతి లేకుండా వెదురు కర్రల లోడ్‌తో వెళ్తున్న రెండు బొలెరో వాహనాలను సీజ్ చేసినట్లు పాణ్యం అటవీశాఖ డిప్యూటీ రేంజర్ చంద్రహాస్ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ విశ్వసనీయ సమాచారం మేరకు జాతీయ రహదారిపై తనిఖీ చేస్తుండగా రెండు వాహనాల్లో వెదురు కర్రలు, బూజు కర్రలు, బడేలు, ముల్లకర్రలు ఇతర కర్రలు ఉండటంతో స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసు స్టేషన్‌లో ఉంచామన్నారు. తనిఖీలో గోరుకల్లు బీట్ అధికారి అబ్దుల్‌కలాం, రామతీర్థం బీట్ అధికారి మహేష్ పాల్గొన్నారు.

కొండచిలువ హల్‌చల్



కొండల్లో వదిలిన కొండచిలువ

పాణ్యం: బలపనూరు గ్రామంలో హరిజనవాడలోకి ఆదివారం కొండచిలువ రావడంతో స్థానికులు భయాందోళన చెందారు. సమాచారం అందుకున్న నంద్యాల రెస్క్యూటీమ్ సభ్యులు కొండచిలువను పట్టుకోని సుగాలిమెట్ట కొండలో వదలినట్లు పాణ్యం అటవీశాఖ డిప్యూటి రెంజ్ అధికారి చంద్రహాస్ ఆదివారం తెలిపారు.

జానపద కళలు సంస్కృతి, సంప్రదాయాలకు ఆనవాళ్లు

కర్నూలు కల్చరల్: జానపద కళలు మన సంస్కృతి సంప్రదాయాలకు ఆనవాళ్లని వాటిని పోషించడంలో భాగంగా జానపద కళాకారుల ప్రదర్శన ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకర విషయమని క్లస్టర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. కేవీఆర్ కళాశాలలో డాక్టర్ పార్వతి దేవి, లక్ష్మయ్య ఏర్పాటు చేసిన దండబోయిన బాలరంగయ్య పాపులమ్మల స్మారక పురస్కార ఉత్సవంలో వీసీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుర్రకథ ప్రదర్శన ఆకర్షణీయంగా ఉందన్నారు. ఇది విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందన్నారు. క్లస్టర్ విద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాసులు మాట్లాడుతూ తల్లిదండ్రులను, సంస్కృతిని ఉన్న ఊరును గౌరవించడం ప్రేమించడం వంటి విలువలు విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్ కళాశాల మాట్లాడుతూ జానపద కళా రూపాల్లో ఒకటైన బుర్రకథ ఏర్పాటు చేయడం ఎంతో సంతోషమన్నారు. సొంత ఊరు బాంధవ్యాలను నిలుపుకోవడంలోనే గొప్ప తృప్తి ఉంటుందన్నారు. అందరూ సొంత ఊరికి ఏదైనా చేయాలని సామాజిక సేవలో పాల్గొనాలన్నారు. రవీంద్ర విద్యాసంస్థల అధినేత పుల్లయ్య మాట్లాడుతూ ఈనాటి తరం మన ప్రాచీన కళారూపాలను తెలుసుకునే విధంగా బుర్రకథ ఏర్పాటు చేయడం వారికి అవార్డు ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ మాట్లాడారు. రాజమహేంద్రవరం బుర్రకథ కళాకారులు విభూతి బ్రదర్స్‌కు రూ. 15,000 నగదు పురస్కారం శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాంటిస్సోరి విద్యాసంస్థల చిన్నారుల జానపద నృత్య ప్రదర్శనలు, బసవరాజు, అంకయ్యల పాటల కచేరి అలరించింది. కార్యక్రమంలో పలు రంగాలకు చెందిన ప్రముఖులు, సాహితీ వేత్తలు మనోహర్, గంగాధర్, హరిచంద్ర రెడ్డి, పోతన, సురేష్ బాబు, డాక్టర్ చంద్రమౌళి, నీలిమ, సీత మహాలక్ష్మి, మానస, రమేష్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.


బుర్రకథ చెబుతున్న కళాకారులు విభూతి బ్రదర్స్

నగర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



కర్నూలు (టౌన్) : నూతన సంవత్సరం 2024లో అందరికి మంచి జరగాలని, ప్రతి ఒక్కరూ ఆనందంగా, సుఖ సంతోషాలతో జీవించాలని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ ఆకాంక్షించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆదివారం నగర ప్రజలకు ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.





























































కోటి ఆశలతో.. కొంగొత్త ఆకాంక్షలతో

నూతన సంవత్సరం... నవ్య తేజోత్సవం

- సంకల్పం ఉంటేనే సక్సెస్
- కొత్త ఏడాదిలో సరికొత్త ఆలోచనతో ముందుకు సాగుదాం
- లక్ష్యాలను చేరుకునేందుకు నాంది పలుకుదాం
- 2023కు వీడ్కోలు పలుకుతూ 2024కు స్వాగతం పలికిన ప్రజలు



కర్నూలు కల్చరల్: కోటి ఆశలతో కొంగొత్త ఆశయాలతో ప్రజలు నూతన సంవత్సరంలోకి అడుగు పెట్టారు. ఉత్సాహంతో 2024కు స్వాగతం పలికారు. బాణా సంచా కాలుస్తూ కేకులు కట్ చేస్తూ మిఠాయిలు పంచుకుంటూ హ్యాపీ న్యూఇయర్ అంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, ఆత్మకూరు, నందికొట్కూరు, ఆళ్లగడ్డ, పత్తికొండ తదితర పట్టణాల్లో యువత నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.


కొనుగోళ్లకు సిద్ధంగా పూలబొకేలు


కేకుల దుకాణంలో విక్రయ సందడి

కాలగర్భంలో మరో ఏడాది

కాల గర్భంలో మరో ఏడాది (2023) కలిసిపోయింది. నూతన సంవత్సరం 2024లోకి కొంగొత్త ఆశలతో అడుగుపెట్టాం. గతం మనకు కొంత మంచిని కొంత చెడును మిగిల్చి ఉండొచ్చు. నూతనం అనే పదం కొత్త ధనంతో పాటు భవిష్యత్ దర్శనానికి మార్గదర్శనం కావాలి. పాత అనే పదం భవిష్యత్ అనే భవనానికి పునాదిగా మారాలి. పాత కొత్త కలయికలను నెమరు వేసుకుంటూ జీవితాన్ని ఆశావహ దృక్పథంతో నిర్మించుకోవటం మనిషి లక్షణం కావాలి. గడిచిన సంవత్సరంలో ఎంతో మందికి ఎన్నో మధుర జ్ఞాపకాలు ఉంటాయి. మరి కొందరికి చేదు అనుభవాలు కూడా ఉంటాయి. చేదు అనుభవాలను గురువుగా భావించి మధుర జ్ఞాపకాలను పాఠ్యాంశాలుగా అనుకుంటే కొత్త జీవితం ప్రగతి మార్గంలో పయనిస్తుంది. ప్రకృతే మనిషికి పెద్ద పాఠశాల. ఈ సత్యాన్ని ప్రతి మనిషి గ్రహించి తన జీవితాన్ని తాను సంస్కరించుకున్నట్లే ప్రకృతిని కూడా పరి రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. అయితే ఆశకు తగిన కృషి కూడా ఉండాలి. ఆ కృషి సవ్య మార్గంలో నడిస్తే విజయకేతనం ఎగరవేయవచ్చు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు..

దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉంది. ఇంతటి శక్తి కలిగిన యువత నైతిక విలువలను విస్మరించి మానవతా విలువలకు పాతర పెట్టి అభ్యుదయం పేరుతో ఆధునికత పేరుతో మంచిని చెడుగా నిర్వచించటం తగదు. ఆశతో మనిషి జీవించాలి. అత్యాశకు దూరంగా ఉండాలి. ప్రతి ఒక్కరూ 2023 లో చోటు చేసుకున్న చేదు జ్ఞాపకాలకు వీడ్కోలు పలికి నూతన సంవత్సరం 2024లో నూతన తేజంతో, చైతన్యంతో వికాస మార్గాన్ని సామాజిక జీవితాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉంది.

బంధాలను బలపర్చుకోవాలి

ఆధునిక సాంకేతి పరిజ్ఞానం అడ్డూ అదుపు లేకుండా పేట్రేగి పోతోంది. పక్కలో ఏమి జరుగుతుందో కూడా పట్టించుకోని విధంగా మనిషిని తయారు చేస్తుంది. నూతన సాంకేతికత అవసరమే. అయితే దాన్ని మన యొక్క ఉన్నతికి సోపానంగా మలుచుకోవాలే కానీ బానిస కాకూడదు. ఏది ఎంత వరకు అవసరమో అంత వరకే వినియోగించుకోవాలి. అతి అనార్థాలకు దారి తీస్తుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో ఒక భాగమైన ఆండ్రాయిడ్ ఫోన్లు, వాట్సాప్, ఫేస్‌బుక్,, ఇన్‌స్ట్రాగామ్ తరంగాల్లో చిక్కుకొని బంధాలు అనుబంధాలకూ దూరం అవుతున్నాం. ఇలాంటి పరిస్థితుల నుంచి ప్రతి ఒక్కరు జాగ్రత్త పడాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా యువత సాంకేతికతను తమ ఉన్నతికి దోహదపడేలా మలుచుకోవాల్సిన అవసరం ఉంది. బంధాలను బలపర్చుకోవాల్సిన ఆవశ్యకతా ఎంతో ఉంది.

యువత సక్రమ మార్గంలో నడవాలి



యువత సక్రమ మార్గంలో నడవాలి. యువ శక్తిపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంది. యువత సక్రమ మార్గంలో నడిస్తే ఆశయ శిఖరాలను చేరుకోవచ్చు. ఆశ లేనిదే మనిషి జీవితం లేదు. ఆశ పునాదిపైనే జీవితాన్ని నిర్మించుకోవాలి. డిసెంబర్ 31 అనో కొత్త సంత్సరానికి స్వాగతం పలకాలనో నూతనోత్సాహం పరవళ్లు తొక్కితే పరవాలేదు. నూతన ఉత్సాహాన్ని ప్రమాదంలోకి తెచ్చుకో కూడదు. కొత్త సంవత్సరంలో వ్యసనాలకు బానిసలు కాకుండా నిర్దిష్టమైన, నిర్మాణాత్మకమైన ఆలోచనలు, లక్ష్యాలు కలిగి ఉండి వాటిని చేరుకోవాలి. – డాక్టర్ వి.పోతన, సాహితీ వేత్త

ఆశావహంగా ముందుకు సాగాలి



కొత్త సంవత్సరంలో కొత్త ఆలోచనలు, కొత్త ఆశలతో జీవించాలి. మనలో మనం మార్పు చెందాలి. మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలి. సంప్రదాయ బద్ధమైన ఆహారాన్ని తీసుకోవాలి. యువతీ యువకులు ప్రణాళికలబద్ధంగా చక్కని మార్గంలో పయనిస్తూ ఉన్నతికి వెళ్లాలి. నిరాసక్తతను వదిలించుకొని ఆశావహంగా ముందుకు సాగాలి. ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో కుటుంబ సభ్యులతో కలిసి మెలసి ఉండాలి. ఎంచుకున్న రంగంలో ఇష్టపడి పనిచేస్తే గుర్తింపు పొందుతాం. – డాక్టర్ దండబోయిన పార్వతీ దేవి, తెలుగు ఉపన్యాసకురాలు, కేవీఆర్ కళాశాల

క్లుప్తంగా

నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ


నిరాశ్రయులకు దుప్పట్లు కప్పుతున్న సొసైటీ సభ్యులు

కర్నూలు (హాస్పిటల్) : నగరంలోని రహదారులకు ఇరువైపులా రైల్వేస్టేషన్, బస్టాండ్‌లలో ఆశ్రయం పొందుతున్న నిరాశ్రయులకు అజా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సాజిద్ దుప్పట్లు పంపిణీ చేశారు. శనివారం రాత్రి, ఆదివారం వారు సొసైటీ ఆధ్వర్యంలో సభ్యులు బృందంగా ఏర్పడి నగర వీధుల్లోని రహదారులకు ఇరువైపులా పడుకున్న నిరాశ్రయులను గుర్తించి దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో అజీస్, తౌసిఫ్, అబ్దుల్లా, ఇస్మాయిల్, మన్సూర్, సమీర్, రహమత్, అషూ, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం


పట్టుబడిన మద్యంతో ఎస్‌ఐ కిరణ్

మంత్రాలయం: మండల పరిధిలోని మాధవరం తండాలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ కిరణ్ తెలిపారు. ఆదివారం గ్రామంలో తనిఖీ చేశామన్నారు. సుగాలి సూర్య నాయక్, సుగాలి హనుమంతు నాయక్, సుగాలి శివాజీ నాయక్ వారి దుకాణాల్లో మద్యం అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. వారి వద్ద నుంచి కింగ్‌ఫిషర్ 29 బాటిళ్లు, మాన్షన్ హౌస్ 17 బాటిళ్లు, 6 టెట్రా ప్యాకెట్లు, 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే మాధవరం తండా పరిధిలోని పొలాల్లో సుమారు 1000 లీటర్ల సాటా ఊట ధ్వంసం చేసినట్లు చెప్పారు.

ప్రయాణికుల భద్రతే ముఖ్యం

కోసిగి: రైలు ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా రైల్వేశాఖ పనిచేస్తోందని గుంతకల్లు డివిజన్ సీనియర్ డీపీఓ చౌహాన్, సీనియర్ డీఎస్‌ఓ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం కోసిగి రైల్వేస్టేషన్‌ను సందర్శించి ప్రయాణికుల సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులు ఇష్టానుసారం రైలు పట్టాలు దాటి వెళ్లడం, రన్ ఓవర్, లెవెల్ క్రాస్ చేయడం వంటి పనులు చేసి ప్రాణాలతో చెలగాటం ఆడరాదన్నారు. ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ఉపయోగించాలని సూచించారు. కోసిగి రైల్వేస్టేషన్‌లో మౌలిక వసతులు కల్పించాలని పలువురు ప్రయాణికులు వారిని కోరారు. అలాగే గుంతకల్లు నుంచి గుల్బర్గాకు వేళ్లే ప్యాసింజర్ రైలు, కన్యాకుమారి, రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైళ్లను కోసిగి స్టేషన్‌లో నిలుపుదల చేసేలా చూడాలని కోరారు. అనంతరం కోసిగి ఆర్టీసీ బస్టాండ్ వద్ద గుంతకల్లు రైల్వే స్కూల్ విద్యార్థినిలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

తైక్వాండో క్రీడాకారులకు ప్రోత్సాహమందిస్తా

కర్నూలు (టౌన్): తైక్వాండో క్రీడాకారులకు తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తానని వీఆర్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ సి.వాసురెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో తైక్వాండో బెల్టు గ్రేడ్ పోటీలు, బెల్టులు ప్రదానం చేశారు. పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత క్రీడాంశంగా ఉన్న తైక్వాండో ఒలింపిక్ సంఘం గుర్తించిన క్రీడ అన్నారు. ఇటువంటి క్రీడను అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అనంతరం పోటీల్లో ప్రతిభ చాటిన చిన్నారులకు బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, తైక్వాండో జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


బెల్టులు, ప్రశంసాపత్రాలు అందిస్తున్న డాక్టర్ సి. వాసురెడ్డి

అర్ధరాత్రి 'నూతన' వేడుకలు


కేక్ కట్ చేస్తున్న జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ తదితరులు

కర్నూలు (సెంట్రల్): 2024 నూతన సంవత్సంలో జిల్లా ప్రజలకు అన్ని శుభాలే కలగాలని కోరుకుంటున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి సృజన పేర్కొన్నారు. ఆదివారం అర్ధరాత్రి క్యాంపు కార్యాలయంలో కలెక్టర్, ఎస్పీ జి కృష్ణకాంత్, మున్సిపల్ కమిషనర్ భార్గవతేజ నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. చిన్నారులతో కలిసి కేక్‌ను కట్ చేసి పంచి, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, వారి ఆదాయ వనరులు రెట్టింపు కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పరంగా ప్రజలకు అందించాల్సిన సేవలను వారి దరికే చేర్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోండి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, విజేతలకు ట్రోఫీలు అందజేస్తున్న ఎమ్మెల్యేలు హాఫీజ్, కాటసాని, సుధాకర్, మేయర్ బీవై రామయ్య

- గ్రేటర్ రాయలసీమ స్థాయి టెన్నిస్ పోటీల ముగింపులో ప్రజాప్రతినిధులు
- విజేతలకు మెడల్స్, ట్రోఫీలు, నగదు ప్రోత్సాహకాలు అందజేత

కర్నూలు (టౌన్): విద్యార్థులు, యువతీయువకులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని పాణ్యం ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, హాఫీజ్‌ఖాన్, సుధాకర్, మేయర్ బీవై రామయ్య అన్నారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఆడుదాం- ఆంధ్ర పేరుతో క్రీడాపోటీలు నిర్వహిస్తుందన్నారు. స్థానిక జోహరాపురం రోడ్డులో ఉన్న ప్రొఫెషనల్ టెన్నిస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రేటర్ రాయలసీమ స్థాయి టెన్నిస్ పోటీలు ఆదివారం ముగిశాయి. సాయంత్ర విజేతలకు బహుమతుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ నేటి తరం చిన్నప్పటి నుంచే సెల్‌ఫోన్లకు అంకితమవుతుందన్నారు. దీంతో అనవసరమైన అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. చిన్న వయస్సులో చదువు, క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఆ దిశగా తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలన్నారు. కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ అంది వచ్చిన అవకాశాలను వినియోగించుకుని క్రీడల్లో రాణించాలన్నారు. ప్రస్తుతం క్రీడలకు మంచి ఆదరణ ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహిస్తుందన్నారు. ఏపీ, సీఎం కప్, స్కూల్‌గేమ్స్, ఆడుదాం-ఆంధ్ర పేరుతో క్రీడా పోటీలు నిర్వహిస్తుందన్నారు. నగర మేయర్ బీవై.రామయ్య మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కర్నూలు నగరానికి చెందిన డెఫ్ ఒలింపిక్ క్రీడాకారిణి షేక్ జాఫ్రీన్‌కు ఇటీవలే ప్రభుత్వం గ్రూపు-1 ఉద్యోగం కల్పించిందన్నారు. క్రీడలకు అమె అంబాసిడర్‌గా వ్యవహరిస్తుందన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కోటిరూపాయలు వెచ్చించి నూతనంగా ఇండోర్ స్టేడియం, మరో కోటితో ఆధునిక స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు నిర్మించామన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ పిల్లలు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. టోర్నమెంట్‌లో సబ్ జూనియర్ స్థాయిలో పాల్గొంటున్న క్రీడాకారులను, తల్లిదండ్రులను అభినందిస్తున్నానన్నారు. ఆయా విభాగాల్లో విజేతలుగా నిలిచిన బాలికలు, బాలురకు మెడల్స్, ట్రోఫీలు, నగదు ప్రోత్సాహకాలను ఎమ్మెల్యేలు అందజేశారు.

విజేతల వివరాలు

అండర్ -8 విభాగంలో రెహాన్ (విన్నర్), షాన్వి (రన్నర్), అండర్-10 విభాగంలో ధీరజ్ నిమ్మల (విన్నర్), ధీరజ్ రామ్ (రన్నర్), అండర్-12 మిక్స్‌డ్ సింగిల్ విభాగంలో సయ్యద్ సాహిల్ (విన్నర్), భావన (రన్నర్), అండర్-14 బాలికల విభాగంలో భవిష (విన్నర్), సమృద్ధి (రన్నర్), అండర్-14 బాలుర విభాగంలో జీషాన్ ఖాన్ (విన్నర్), ఖుర్షీద్ (రన్నర్), అండర్-16 విభాగంలో రొనాల్డినో (విన్నర్), శంకర్ (రన్నర్), అండర్ -16 డబుల్స్ విభాగంలో రోనాల్డ్, జీషమ్ (విన్నర్స్), శంకర్, రామ్ ధీరజ్ (రన్నర్స్), పురుషుల విభాగంలో ఆరోన్ రొనాల్డినో (విన్నర్), దేశం సాయి శంకర్ (రన్నర్), మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో మహాలక్ష్మి, శంకర్ (విన్నర్స్), రోనాల్డ్, భువన్ (రన్నర్స్)గా నిలిచారు.



టెన్నిస్ ఆడుతున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య, ఎమ్మెల్యేలు హాఫీజ్‌ఖాన్, సుధాకర్

మంత్రాలయం మండలం కచ్చాపురం గ్రామానికి చెందిన ఆంజనేయులు కుమారుడు రాముడు (7) కిడ్నాప్ అయ్యాడు. కేసును ఆదోని రైల్వే పోలీసులు 2023 ఏప్రిల్ 3న నమోదు చేశారు. 24 గంటల్లోపు గుంతకల్‌లో ఉన్న బాలుడిని గుర్తించి ముగ్గురిని అరెస్టు చేశారు. పిల్లలను కిడ్నాప్ చేసి రూ.3 లక్షలకు అమ్మేస్తున్నారని విచారణలో తేలింది. రూ.1.60 లక్షలు అడ్వాన్స్ తీసుకుని గుంతకల్‌లో బాలుడిని అందజేసే సమయంలో పోలీసులు చాకచాక్యంగా పట్టుకున్నారు.

'దిశ' యువత, మహిళల నమ్మకం..

దిశ యాప్‌పై పోలీసులు యువత, మహిళలకు అవగాహన కల్పించడంతో ఈ ఏడాది ఆదోని నియోజకవర్గంలో 50 వేల మంది వారి మొబైల్ ఫోన్‌లలో దిశ యాప్‌ను రిజిస్టర్ చేసుకున్నారు. ఇందులో 5 వేల మంది అత్యవసర సమయాల్లో యాప్ ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకున్నారు. ఈ యాప్ మహిళలకు కొండంత ధైర్యాన్ని ఇస్తోంది.

నేరాల కట్టడి

- సంచలనాత్మక కేసుల్లో పురోగతి
- 24 గంటల్లోనే పలు కేసులు ఛేదన
- ఆదోని సబ్‌డివిజన్‌లో 1,371 కేసులు నమోదు కాగా, 1213 కేసుల పరిష్కారం
- డ్రంకెన్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి
- రోడ్డు భద్రతపై ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు
- దిశపై విస్తృత ప్రచారం
- ఆదోని పోలీసుల పనితీరుపై ప్రశంసలు

ఆదోనిఅర్బన్: కనీసం క్లూ కూడా లభించని సంచలనాత్మక కేసులను 24 గంటలలోపు ఛేదించడం.. నేరాల నియంత్రణకు పక్కా ప్రణాళికతో ముందడుగు..మద్యం అక్రమ రవాణా, బెట్టింగ్, మట్కా, జూదంపై ఉక్కుపాదం. మరోవైపు యువతలో చైతన్యం తీసుకొచ్చేందుకు కళాశాల్లో అవగాహన కార్యక్రమాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన, రౌడీషీటర్‌లపై ప్రత్యేక నిఘా.. పటిష్ట భద్రతా చర్యలతో తగ్గిన దొంగతనాలు.. సమర్థవంతమైన సేవలకు అవార్డులు, రివార్డులు.. ఇవీ ఆదోని పోలీసుల ప్రత్యేకతలు.

1,213 కేసులు పరిష్కారం

➡ ఆదోని సబ్‌డివిజన్ పోలీసుశాఖ పరిధిలో ఈయేడాది 1,371 కేసులు నమోదయ్యాయి. ఇందులో 1,213 కేసులను పరిష్కరించారు. 28 చోరీ కేసుల్లో రూ.52,43,500 నగదు దొంగలించబడగా, ఇందులో రూ.27,68,500 నగదును రికవరీ చేశారు. అంతర్‌రాష్ట దొంగలను పట్టుకొని, కోర్టులో శిక్ష పడేలా చేసి ఎస్పీ నుంచి రివార్డులు అందుకున్నారు.

➡ పట్టణంలో ఐపీఎల్ వరల్డ్‌కప్ క్రికెట్ బెట్టింగ్ చేస్తున్న నిర్వాహకులపై దాడి చేసి కోట్లాది రూపాయలను స్వాధీనం చేసుకొని నిందితులును కటకటాల్లోకి పంపారు. మే నెలలో త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీరామ్ ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులపై దాడులు చేసి రూ.80 లక్షల నగదు, ఒక కారు, రెండు బైకులు, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని, నిందితులను రిమాండ్‌కు పంపారు. అలాగే వరల్డ్ కప్ క్రికెట్ బెట్టింగ్‌లో రూ.లక్షల్లో నగదును స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు పంపారు. సబ్‌డివిజన్ పరిధిలో 829 మంది రౌడీషీటర్లుగా గుర్తించి కేసులు నమోదు చేశారు.

➡ 2022లో 39 రోడ్డు ప్రమాదాలు జరగగా 32 మంది మరణించారు. 2023 ఏడాదిలో 19 చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 16 మంది మృతి చెందారు. అంతేగకుండా రెండేళ్లలో 4 హత్యలు జరిగాయి. 2022లో 9 హత్యాయత్నం కేసులు నమోదవగా, ఆ తర్వాతి సంవత్సవం 6 మాత్రమే నమోదయ్యాయి. 2022లో 22 దొంగతనాలు చోటు చేసుకోగా, 2023లో 13 మాత్రమే చోటుచేసుకున్నాయి. అలాగే 2022లో 48 ఆత్మహత్యలు జరుగగా, ఆ తర్వాత ఏడాది 54 నమోదయ్యాయి. అయితే ఇందులో అధిక శాతం కేసులను పోలీసులు వెంటనే పరిష్కరించారు. ఆదోని పట్టణంలో ఏడాది కాలంలో 119 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. వారందరికీ కోర్టులో జరిమానా విధించారు.


క్రికెట్ బుకీలను మీడియాకు చూపుతున్న డీఎస్పీ శివనారాయణస్వామి (ఫైల్)


ఆర్‌ఆర్ లేబర్ కాలనీలో విద్యార్థులకు దిశా యాప్ డౌన్‌లోడ్ చేయిస్తున్న మహిళా కానిస్టేబుల్

కేసులను పూర్తిస్థాయిలో పరిష్కరించాం



2023 ఏడాదిలో 1,371 కేసులు నమోదు కాగా 1,213 పరిష్కరించాం. దొంగతనాల కేసుల్లో కూడా 63 రికవరీ చేశాం. ఐపీఎల్, వరల్డ్‌కప్ క్రికెట్ బెట్టింగ్‌ల నిర్వాహకులపై దాడులు చేసి బెట్టింగ్‌లు జరగకుండా నివారించాం. రోడ్డు ప్రమాదాలు జరగకుండా గట్టి చర్యలు చేపట్టాం. దొంగతనాలు జరగకుండా బందోబస్తు పటిష్టం చేశాం. ఆత్మహత్యలు, అఘాయిత్యాలు, రోడ్డు ప్రమాదాలపై విద్యాలయాల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. మొత్తానికి ఏడాది కాలంలో క్రైమ్ రేటు తగ్గింది.

– శివనారాయణస్వామి, ఆదోని డీఎస్పీ

క్రీడలను ఎంచుకోండి

కర్నూలు (టౌన్) : విద్యార్థులు దురాలవాట్లకు దూరంగా ఉండేందుకు, క్రమశిక్షణ కలిగిన పౌరులుగా ఎదిగేందుకు క్రీడలకు మించిన సాధనం లేదని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్‌ఆర్‌పేటలోని శ్రీలక్ష్మి హైస్కూల్‌లో ఫిజికల్ ఫిట్నెస్ సాధించిన సిలంబం (కర్రసాము) క్రీడా రెఫరీలు, కోచ్‌ల అభినందన కార్యక్రమం నిర్వహించారు.

వార్డు సభ్యుడి మృతి

పెద్దకడబూరు: పెద్దకడబూరు పంచాయతీ రెండో వార్డు సభ్యుడు కోసిగి బసన్న(56) ఆదివారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతిపై సర్పంచ్ రామాంజినేయులు, నాయకులు రామ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి సానుభూతి తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ శ్రీ జగన్నాథ మందిరంలో భగవద్గీత శ్లోకాల పోటీల విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. గీతా జయంతి సందర్భంగా డిసెంబర్ 23 వ తేదీన శ్రీమద్భగవద్గీత ఒకటవ, రెండవ అధ్యాయాలపై రాత పరీక్షను జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించారు. పోటీల్లో 200 మంది విద్యార్థులకు పైగా పాల్గొన్నారన్నారు. మొదటి బహుమతి రూ.5,116, ద్వితీయ బహుమతి రూ.3,116, తృతీయ బహుమతి రూ.2,116 నగదు బహుమతులను డాక్టర్ భీమేశ్వరి, శ్రీనివాసులు, గణేష్ మహోత్సవ కేంద్ర సమితి నగర అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు బహుమతులు ప్రదానం చేశారు. జూనియర్ విభాగంలో విద్యానగర్ మాంటిస్సోరి స్కూల్ 7వ తరగతి విద్యార్థి శ్రీనిధి ప్రథమ బహుమతి, ఎన్నార్‌పేట సెయింట్ జోసెఫ్ స్కూల్ 7వ తరగతి విద్యార్థి జె.ఉద్భవ సాయి ద్వితీయ బహుమతి, 7వ తరగతి విద్యార్థి యు.వర్షిత్ రెడ్డి తృతీయ బహుమతి, సీనియర్ విభాగంలో ఎ.క్యాంప్ మాంటిస్సోరి 9వ తరగతి విద్యార్థి అమృత వర్షిణి ప్రథమ బహుమతి, 9వ తరగతి విద్యార్థి సృజన ద్వితీయ బహుమతి, కట్టమంచి రామలింగారెడ్డి స్కూల్ 9వ తరగతి విద్యార్థి డి. హారతి తృతీయ బహుమతి సాధించారు. ఇస్కాన్ నిర్వాహకులు వైష్ణవ కృప చైతన్య ప్రభు, రఘునందన సేవక దాసు తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుతులు అందజేస్తున్న అతిథులు

మురిపిస్తున్న వరి



మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో వరి పంట బాగా పండింది. రెండు మండలాల్లో సుమారు 13వేల హెక్టార్ల విస్తీర్ణంలో వరి పంటను రైతులు సాగు చేశారు. ఇప్పటికే సుమారు ఎనభై శాతం వరికోతలు పూర్తయ్యాయి. అక్కడక్కడ మిగిలిన దిగుబడిని రైతులు కల్లాలకు చేర్చి ఆరబోస్తున్నారు. ధర సైతం బాగుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు రెండు మండలాల్లో రైతులు బిజీబిజీ అయ్యారు.


పెద్దదేవళాపురం పంట పొలాల్లో ఆరబెట్టుకున్న ధాన్యం


బస్తాల్లో నింపి అమ్మకానికి సిద్ధంగా ఉంచిన వరి

–మహానంది



రైతులకు సలహాలు, సూచనలివ్వండి

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఉత్పాదకత సాధించే పద్ధతులపై అవగాహన పెంచండి
- ఇన్‌పుట్ డీలర్లకు విశ్రాంత డీడీఏ భగవత్ స్వరూప్ సూచనలు


దేశీ కార్యక్రమంలో మాట్లాడుతున్న విశ్రాంత డీడీఏ భగవత్ స్వరూప్

కర్నూలు(అగ్రికల్చర్): రైతులకు తగిన సాంకేతిక సలహాలు ఇచ్చి సహకరించాలని విశ్రాంత డీడీఏ భగవత్ స్వరూప్ ఇన్‌పుట్ డీలర్లకు సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో దేశీ డిప్లొమ కోర్సుపై ఇన్‌పుట్ డీలర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. గతంలో ఇన్‌పుట్ డీలర్లకు ఎలాంటి శిక్షణ కార్యాక్రమాలు లేవని, ఇందువల్ల రైతులకు సరైన సలహాలు,సూచనలు అందేవి కావని పేర్కొన్నారు. రైతులు ప్రతి అవసరానికి ఇన్‌పుట్ డీలర్లనే ఆశ్రయిస్తున్నందున ప్రభుత్వం ప్రత్యేక చొరువ తీసుకొని డిప్లొమ కోర్సుపై శిక్షణ ఇస్తోందని తెలిపారు. వివిధ పంటలకు సోకే చీడపీడలకు సంబంధించి రైతులకు చక్కటి సలహాలు, సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఉత్పాదకత సాధించే విధంగా రైతులకు సహకరించాలని పేర్కొన్నారు. దేశీ కోర్సు సమన్వయకర్త, విశ్రాంత జేడీఏ జయచంద్ర మాట్లాడుతూ... శిక్షణలో చెప్పే అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా రైతులకు మంచి సలహాలు, సూచనలు ఇవ్వవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో 40 మంది ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

ఘనంగా పుస్తకావిష్కరణ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని విశ్వనగర్‌లోని గాంధీ దేవాలయంలో సూరన సారస్వత సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ విజయం పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత డాక్టర్ శ్రీదేవి మాట్లాడారు.





12 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థలో పనిచేస్తున్న క్లాప్ డ్రైవర్లకు చెల్లించాల్సిన 12 నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు పుల్లారెడ్డి, నాగరాజు, నౌషాద్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక నగరపాలక సంస్థ ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు గత 15 సంవత్సరాలుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుతున్న క్లాప్ డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఇస్మాయిల్, శేఖర్, రాజేష్, సుధాకర్, బాబ్జి పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో కొత్త దుస్తుల వితరణ


చిన్నారులకు కొత్త దుస్తులు అందజేస్తున్న సుమన్

కర్నూలు (హాస్పిటల్) : డేనియల్ రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రవాస భారతీయుల సహకారంతో నగరంలోని వెంకటరమణ కాలనీలో ఉన్న కీర్తన అనాథాశ్రమంలో అనాథ పిల్లలకు కొత్త బట్టలను విరాళంగా అందజేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని అమెరికాలో ఉంటున్న ప్రవాస భారతీయులైన కిషోర్, సుష్మ వారిచే పిల్లలకు కొత్త బట్టలు, స్వీట్లు అందజేశారు. ఈ సందర్భంగా డేనియల్ రాజు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుమన్ మాట్లాడుతూ ఇప్పటివరకు ఫౌండేషన్ తరఫున ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, అందులో భాగంగా తన స్నేహితుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జ్యోతి, మానస, లక్షయ్ తదితరులు పాల్గొన్నారు.



దొంగల అరెస్టు

కర్నూలు: కర్నూలు రెండో పట్టణ పోలీసులు ముగ్గురు దొంగలను అరెస్టు చేసి కటకటాలకు పంపారు. పర్ల గ్రామానికి చెందిన సుధాకర్ డాక్టర్ దగ్గర వైద్యం చేయించుకుని మున్సిపల్ కార్యాలయం దగ్గర ఆటో ఎక్కి కొత్తబస్టాండ్‌కు వెళ్తుండగా ముజఫర్ నగర్‌కు చెందిన జుబేర్, భాస్కర్, షేక్‌షావలి ప్రయాణికుల వలే ఆటోలో ఎక్కారు. సుధాకర్ జేబులో ఉన్న రూ.10 వేలు నగదు కొట్టేసి మార్గమధ్యంలో దిగిపోయారు. బస్టాండ్‌కు వెళ్లిన తర్వాత జేబులో డబ్బులు చూసుకోగా కనిపించకపోవడంతో చోరీ చేశారని నిర్ధారించుకుని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించి దొంగలను గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు.

నేటి నుంచి ప్రతి ఇంటికీ అయోధ్య అక్షింతలు


అయోధ్య రామ మందిర చిత్ర పటం, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు

కర్నూలు కల్చరల్: జనవరి 1 నుంచి 15వ తేదీ వరకు దేశ వ్యాప్తంగా దాదాపు 20 కోట్ల కుటుంబాలకు అయోధ్య పూజిత అక్షింతల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వినాయక ఘాట్ సమావేశ ప్రాంగణంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అయోధ్య పూజిత అక్షింతలు, చిత్రపటం, కరపత్రాన్ని ప్రతి ఒక్కరూ ఇంట్లో ఉంచుకుని అయోధ్య శ్రీరామచంద్రుడు ఆహ్వానాన్ని స్వీకరించి జనవరి 22వ తేదీన అయోధ్య దీపావళిని వైభవంగా నిర్వహించుకోవాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ మాట్లాడుతూ శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటికే కర్నూలు జిల్లాలో అన్ని దేవాలయాల కేంద్రాలకు, అన్ని గ్రామాలకు అయోధ్య పూజిత అక్షింతలను, ఆహ్వాన పత్రం, చిత్ర పటాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. జన సంపర్క్ అభయాన్ రాష్ట్ర కన్వీనర్ గూడా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జిల్లాలో జనవరి 1 నుంచి 5వ తేదీ లోపు ప్రతి ఇంటికీ అయోధ్య అక్షింతలు పంపిణీ చేస్తామన్నారు. సమావేశంలో బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ టి.ప్రతాప్‌రెడ్డి, విశ్వహిందూ పరిషత్ కర్నూలు నగర అధ్యక్షులు టి.సి.మద్దిలేటి, రాష్ట్ర కోశాధికారి సందడి మహేశ్వర్, ధర్మ ప్రచార రాష్ట్ర కన్వీనర్ అనంత విశ్వప్రసాద్, నాయకులు గురుమూర్తి, భానుప్రకాష్ పాల్గొన్నారు.





కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

కర్నూలు(సెంట్రల్): తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఆదివారం శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్ వద్ద చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, చంద్రశేఖర్, ఉప కార్యదర్శి టి.రామాంజనేయులు, సీఐటీయూ జిల్లాప్రధాన కార్యదర్శులు సుధాకరప్ప, విజయ్ కుమార్ పాల్గొని మాట్లాడారు.

12వ రోజుకు ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సమ్మె

సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేసే ఉద్యోగులు చేపట్టిన సమ్మె 12వ రోజుకు చేరుకుంది. ఆదివారం శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో సమ్మె కొనసాగించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, రంగన్న మాట్లాడుతూ..ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం కింద రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మహానందిలో సండే సందడి



మహానంది: మహానంది ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం నుంచి ప్రారంభమైన స్వామి, అమ్మవార్ల దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి అయ్యప్పదీక్ష స్వాములు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చారు. మహానందీశ్వర స్వామి దర్శనం అనంతరం ఆలయ ప్రాంగణంలో తమ వాహనాలకు పూజలు చేసుకుని బయల్దేరారు.





సారూ..ఈ గుంతను పూడ్చండి


సీ క్యాంప్ క్వార్టర్స్ - శ్రీరామ్‌నగర్‌కు వెళ్లే దారిలో పైప్‌లైన్ గుంత

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు నగరంలోని రైతు బజార్ నుంచి సీ క్యాంప్ క్వార్టర్స్ సీ/బీ 68 ఇంటి సమీపంలో శ్రీరామ్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో రెండు నెలల క్రితం పైప్‌లైన్ లీకవ్వడంతో గుంతను తవ్వి వదిలేశారు. పక్కనే శ్రీచైతన్య స్కూల్ పిల్లలు, ప్రయాణికులు ప్రతి రోజూ ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఎవరైనా ఆదమరిస్తే గుంతలో పడే ప్రమాదం ఉంది. నగర పాలక సంస్థ అధికారులు స్పందించి పైప్‌లైన్ గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.



త్వరలో ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులను ప్రకటిస్తాం

కర్నూలు (సెంట్రల్): లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచే ఎస్‌డీపీఐ అభ్యర్థుల జాబితాను త్వరలోనే ప్రకటిస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు హఫీజ్ అతావుల్లా ఖాన్ ప్రకటించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ..వచ్చే ఎన్నికల్లో ఏపీలో అసెంబ్లీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నట్లు చెప్పారు. అనంతరం కర్నూలు లోక్‌సభ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా షేక్ ఖలీల్ అహ్మద్ (కర్నూలు), జాయింట్ కన్వీనర్‌గా ఖాదర్‌బాషా (ఎమ్మిగనూరు)లతో పాటు మరో 7 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల కమిటీ సభ్యుడు అబ్దుల్ సత్తార్, జిల్లా అధ్యక్షుడు జహంగీర్ అహ్మద్ పాల్గొన్నారు.





